క్లుప్తంగా

నేడు ఉచిత వైద్య శిబిరం

పాలమూరు: సుశ్రుత ప్రజా వైద్యశాల ఆధ్వర్యంలో ఆదివారం సుశ్రుత ఆస్పత్రిలో పిల్లలు పుట్టాలని కోరుకునే వారి కోసం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు వైద్యురాలు పి.ప్రతిభ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ శిబిరంలో సెమెన్ ఎనాలసిస్, ఆల్ట్రాసౌండ్, డాక్టర్ కన్సల్టేషన్ ఉచితంగా ఉంటుందని పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పిల్లలు కావాలనుకునే దంపతులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సంతానం కోసం అన్ని రకాల వైద్యసేవలు సుశ్రుతలో అందుబాటులో ఉన్నాయని, అత్యాధునిక వైద్యసేవలు పొందవచ్చునని సూచించారు. ఇతర వివరాల కోసం 88852 21877, 9866 457501 నంబర్లకు సంప్రదించాలని తెలిపారు.

బహుమతులు అందజేత



కేటీదొడ్డి: మండలంలోని వెంకటాపురంలో శనివారం ఏరువాక పండుగ సందర్భంగా రన్నింగ్ పోటీలు నిర్వహించారు. పోటీలో గెలుపొందిన వారికి బీఆర్ఎస్ నాయకుడు గోపి మొదటి బహుమతి ఖాజా వీరేష్, రెండో బహుమతి కావలి వీరేష్‌కు అందజేసి, శాలువతో సన్మానించారు. కార్యక్రమంలో గోపాల్ రెడ్డి, తిమ్మప్ప, నర్సింహులు, నారాయణ, వీరేష్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి ఘనంగా వీడ్కోలు



ఉండవెల్లి: పదవీ విరమణ పొందిన క్రాఫ్ట్ టీచర్‌కు మండల కేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా వీడ్కోలు పలికారు. క్రాఫ్ట్ టీచర్ బీచుపల్లి దంపతులను పాఠశాలకు ఆహ్వానించిన ఉపాధ్యాయులు, విద్యార్థులు పూలు జల్లుతూ స్వాగతం పలికారు. అనంతరం శాలువాలు, పూలమాలలు కప్పి సన్మానించారు. కార్యక్రమంలో మానవపాడు, ఇటిక్యాల, ఉండవెల్లి ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మిషన్ భగీరథ పైప్‌లైన్‌కు మరమ్మతు



అమరచింత: మండలంలోని నందిమళ్ల ఎక్స్‌రోడ్ గ్రామ పంచాయతీ సమీపంలో పగిలిపోయిన మిషన్ భగీరథ పైప్‌లైన్‌కు సిబ్బంది శనివారం మరమ్మతు చేపట్టారు. పైప్‌లైన్‌కు పగుళ్లు రావడంతో నీరంతా అక్కడే లీకేజీ అవుతోందని ప్రజలు మిషన్ భగీరథ సిబ్బందికి సమాచారం అందించారు. స్పందించిన సిబ్బంది పైప్‌లైన్ వద్ద సిమెంట్‌తో మరమ్మతు చేశారు. దీంతో నందిమళ్ల ఎక్స్‌రోడ్‌తో పాటు కిష్టంపల్లి, ఈర్లదిన్నె, చింతరెడ్డిపల్లి, మిట్టనందిమళ్ల గ్రామాల ప్రజలకు తాగునీటి కష్టాలు తప్పాయి.



వడ్డేపల్లి మండలం జూలెకల్‌లో ఎద్దుల ఊరేగింపు



గట్టులో కాడెద్దుల ఊరేగింపు



కేటీదొడ్డిలో ఎద్దులను ఊరేగిస్తున్న రైతులు

సందడిగా ఏరువాక సంబరాలు

శాంతినగర్: ఏరువాక పర్వదినాన్ని వడ్డేపల్లి మున్సిపాలిటీ, మండలంలోని ఆయా గ్రామాల్లో శనివారం ఘనంగా నిర్వహించారు. సుంకులమ్మ, జములమ్మ, మారెమ్మ, కర్రెమ్మ, పెద్దమ్మ, తాయమ్మ, ఈదమ్మ, సవారమ్మలకు ప్రత్యేక నైవేద్యాలతోపాటు కోడి పుంజులు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కాడెద్దులకు అలంకరించి గ్రామ వీధుల్లో ఊరేగించారు. సాయంత్రం ఆయా గ్రామాల్లోని చావిడిల వద్ద ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన తోరణాలను చెరణకోళ్లతో కొడుతు, కేరింతలు వేస్తూ తెంపే కార్యక్రమాన్ని ఉల్లాసంగా కొనసాగించారు.

గట్టు: ముంగారి సేద్యం ప్రారంభంలో రైతులు చేసుకునే అతి పెద్ద పండుగ ఏరువాక పండుగ. శనివారం రైతులు పండుగను ఆనందోత్సాహాల మధ్య ఎంతో ఉత్సాహంగా చేశారు. ఈ పండుగ తర్వాత రైతులు వారి వారి వ్యవసాయ పనుల్లో బీజీగా మారుతారు. అన్నదాతలు గ్రామ దేవతలకు భక్తిశ్రద్ధలతో నైవేద్యాలను సమర్పించుకున్నారు. మండల కేంద్రానికి చెందిన గొల్లకురుమలు గ్రామంలో కుంభం కుండతో ఊరేగింపుగా వెళ్లి గ్రామ దేవత సుంకులమ్మకు మొక్కులను చెల్లించుకున్నారు.



అయిజలో ఎద్దులను ఊరేగిస్తున్న రైతులు

రాజోళి: మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో ఏరువాక పౌర్ణమిని ప్రజలు ఘనంగా నిర్వహించారు. స్థానిక ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు.

అయిజ: మండలంలో ఏరువాక పండుగ సందర్భంగా ఆలయాల్లో పూజారులు ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు బోనం ఎత్తుకొని ఊరేగింపుగా వెళ్లి గ్రామ దేవతలకు సమర్పించుకున్నారు.

కేటీదొడ్డి: మండల కేంద్రంలో సుంకులమ్మ, సవారమ్మకు భక్తులు నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. రైతులు కాడెద్దులను అలంకరించి పొలంలో దుక్కి దున్నారు.

మల్దకల్: మండలంలో గ్రామ దేవతలైన సుంకులమ్మ, ,సవారమ్మ, ఈదమ్మ దేవతలకు నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

ఎర్రవల్లిచౌరస్తా: ఉమ్మడి ఇటిక్యాల మండలంలోని గ్రామాలలో ఏరువాక సంబరాలను ప్రజలు ఘనంగా నిర్వహించారు. సాయంత్రం సుంకులమ్మకు బోనాలతో ప్రత్యేక నైవేద్యం వండి గ్రామస్తులతో కలిసి ఎద్దుల జతలతో సమూహంగా వెళ్లి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

ధరూరు: మండలంలోని నెట్టెంపాడు, జాంపల్లి, దోర్నాలలో రైతు సంబరాలు నిర్వహించారు. తోరణాలు తెంచే కార్యక్రమం ఘనంగా జరిగింది. నెట్టెంపాడులో రైతు జయరాం ఎద్దులు తోరణం తెంచే పోటీల్లో గెలుపొందాయి.



ఎర్రవల్లిలో రద్దీగా మారిన సుంకులమ్మ ఆలయం



చెన్నిపాడులో పూజలు చేస్తున్న గ్రామస్తులు



రాజోళిలోని కోటవీధి సుంకులమ్మ ఆలయంలో..



నెట్టెంపాడులో తోరణం తెంచిన ఎద్దులు



షేకుపల్లిలో బోనాల ఊరేగింపు



అయిజ మండలం కిష్టాపురంలో బోనాలు ఎత్తుకున్న భక్తులు

ఆదిశిలాక్షేత్రంలో పూజలు



మల్దకల్‌లో పూజలు నిర్వహిస్తున్న భక్తులు



శాంతినగర్‌లో పారాయణం చేస్తున్న మహిళలు

మల్దకల్: మండల కేంద్రంలోని ఆదిశిలా క్షేత్రమైన లక్ష్మీవెంకటేశ్వరస్వామి ఆలయం శనివారం భక్తులతో పోటెత్తారు. శనివారం వారాంతపు సంత కావడంతో ఆలయ అవరణ మొత్తం భక్తులతో కిక్కిరిసిపోయింది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.

ధరూరు: మండలంలోని ప్రధాన ఆలయాల్లో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్ద చింతరేవుల, తెలుగోనిపల్లి అంజనేయస్వామి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు.

శాంతినగర్: శాంతినగర్‌లోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఆర్యవైశ్య మహిళలు అమ్మవారి అష్టోత్తర పారాయణం, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం గోమాతను అలంకరించి పశుగ్రాసం పెట్టి పూజలు చేశారు.

గుప్తనిధుల కోసం తవ్వకాలు



గుప్తనిధుల కోసం గుర్తుతెలియని వ్యక్తులు తవ్విన గుంతలు

రాజోళి: మండల కేంద్రం రాజోళిలోని తుంగభద్ర నదిలో ఉన్న పురాతన రామలింగేశ్వర స్వామి ఆలయం వద్ద గుప్త నిధుల కోసం కొందరు తవ్వకాలు చేపట్టారు. శనివారం ఏరువాక పౌర్ణమి పండుగ కావడంతో పూజలు చేసేందుకు గుడికి వెళ్లిన అర్చకుడు అడివిస్వామి గుంతలు తీసి ఉండటం గమనించి స్థానికులకు సమాచారం అందించారు. నది మధ్యలో ఉన్న ఆలయం చాలా పురాతమైనది కావడంతో అక్కడ ఏమైనా నిధులు ఉంటాయనే ఆలోచనతో గుర్తు తెలియని వ్యక్తులు ఈ తవ్వకాలకు పాల్పడినట్లు తెలిసింది. గతంలో కూడా ఇక్కడ తవ్వకాలు చేసిన కొందరు నందివిగ్రహాలను ధ్వంసం చేశారు. అయితే కొన్నేళ్లుగా అలాంటి ఘటనలు చోటుచేసుకోలేదు. కానీ తాజాగా జరిగిన ఘటన మళ్లీ చర్చకు దారితీస్తోంది. కాగా శుక్రవారం మధ్యరాత్రి దాటిన తర్వాతనే ఈ తవ్వకాలు జరిగినట్లుగా గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఆలయం ముందు భాగంలో రెండు మూడు చోట్ల తవ్వకాలు చేపట్టారని తెలిపారు.

కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలి

ఆత్మకూర్: ప్రభుత్వ కమ్యూనిటీ హెల్త్‌సెంటర్‌లో పనిచేస్తున్న కార్మికులకు ఏడునెలలుగా వేతనాలు ఇవ్వకపోవడంతో వారు పస్తులు ఉండాల్సిన పరిస్థితి దాపురించిందని తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్, ఏఐటీయూసీ రాష్ట్రకార్యదర్శి సురేష్ అన్నారు. జీఓ 60 ప్రకారం వేతనాలు చెల్లించాలని శనివారం ఆత్మకూర్‌లోని కమ్యూనిటీ హెల్త్‌సెంటర్ వద్ద కార్మికులతో కలిసి నిరసన తెలిపి, వైద్యాధికారి డాక్టర్ వంశీకి వినతిపత్రం అందజేశారు. శానిటేషన్, పేషెంట్ కేర్, సెక్యూరిటీ, సూపర్‌వైజర్ కార్మికులకు జీఓ 60 ప్రకారం రూ.15,600 ఇవ్వాల్సి ఉండగా.. సంబంధిత కాంట్రాక్టర్ వెంకటయ్య, ఏజెన్సీ నిర్వాహకులు కోతలు పెడుతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో కార్మికులు బాలరాజు, పార్వతమ్మ, నాగమ్మ, సత్తార్, భరత్, మోహినొద్దీన్, చెన్నమ్మ, బాలకిష్టమ్మ, శైలజ, వెంకటేష్, తిరుపతమ్మ, లక్ష్మి, అరుణ్ తదితరులు ఉన్నారు.



ఆత్మకూర్‌లో నిరసన తెలుపుతున్న వైద్యకార్మికులు

ఊరూరా హరిత నర్సరీలు

- కేటీదొడ్డిలో 23 ఏర్పాటు
- జూన్ చివరినాటికి మొక్కల పెంపకమే లక్ష్యం



కొండాపురం నర్సరీలలో మొక్కలకు నీటిని పడుతున్న కూలీలు

కేటీదొడ్డి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హరితహారం కార్యక్రమాన్ని పూర్తిస్థాయిలో దిగ్విజయం చేయాలని అధికారులు సిద్ధమవుతున్నారు. జూన్ చివరి నాటికి మొక్కలు నాటేందుకు మండలంలోని 23 గ్రామాల్లో నర్సరీలు ఏర్పాటు చేసి మొక్కలు పెంపకం చేపడుతున్నారు. మండలంలోని నర్సరీల్లో ఈ ఏడాది 2.30 లక్షల మొక్కలను పెంపకం పూర్తి స్థాయిలో సంరక్షించి హరితహారానికి అందించాలనే లక్ష్యంతో అధికార యంత్రాంగం పని చేస్తుంది. గ్రామాల్లో ప్రజల అవసరాలను అనుగుణంగా మొక్కలను పెంచుతున్నారు. పదో విడత హరితహారం జూన్ 30 నుంచి మొక్కలు నాటడానికి ప్రభుత్వం చేపట్టనుండటంతో పనులు ముమ్మరంగా సాగిస్తున్నారు.

పండ్ల, పూల మొక్కల పెంపకం

ఈ ఏడాది హరితహారంలో ప్రజలకు ఇంటి ఆవరణల్లో పెంచేందుకు పండ్లు, పూల మొక్కలను ఎక్కువగా పెంపకం చేస్తున్నారు. నర్సరీలలో పండ్ల మొక్కలైన జామ, అల్లనేరేడు, టేకు, బొప్పాయి, మామిడి, సీతాఫలం, మహగణి, పూల మొక్కలైన మందారం, గన్నేరు, తంగేడు, గులాబీ తదితర మొక్కలను పెంచుతున్నారు.

నర్సరీల్లో పనులు



మండలంలోని 23 గ్రామాల్లో నర్సరీలు ఏర్పాటు చేశాం. వాటిల్లో మొక్కల పెంపకం పనులు వేగవంతం జరుగుతున్నాయి. 2.30 లక్షల మొక్కలను పెంచడం లక్ష్యం. పదో విడత హరితహారానికి మొక్కలను సిద్ధం చేస్తాం. లక్ష్యం మేరకు మొక్కలు పెంచి నాటుతాం.

– ఏపీఓ, అనిల్‌కుమార్, కేటీదొడ్డి

పండ్ల మొక్కలకు ప్రాధాన్యం

ప్రజల అవసరాలకు గుర్తించి ఈ సారి మండలంలోని అధికంగా పూలు, పండ్ల మొక్కలకు ప్రాధాన్యమిచ్చి పెంపకం చేపట్టాం. ఊరూరా నర్సరీలల్లో మొక్కల పెంపకం పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాం.

– ఎంపీఓ, సయ్యద్‌ఖాన్, కేటీదొడ్డి



చింతలకుంట నర్సరీని పరిశీలిస్తున్న ఏపీఓ

‘ఉపాధి’ కూలీల వెతలు

- నాలుగు వారాల వేతనాల పెండింగ్
- అధికారుల తీరుతో పనుల కల్పనలో జాప్యం

రాజోళి: మండలంలోని ఉపాధి కూలీలకు పాట్లు తప్పడం లేదు. వంద రోజులు పని కల్పిస్తామని ప్రభుత్వాలు చెబుతున్నప్పటికీ.. క్షేత్రస్థాయిలో అధికారులు చేస్తున్న జాప్యం వల్ల కూలిలు అందడం లేదని వాపోతున్నారు. చేద్దామంటే సరైన పనులు కల్పించకపోగా, పనులు చేశాక డబ్బులు చెల్లించడంలో అధికారుల ఆలస్యం కారణంగా వారాలు తరబడి బిల్లులు పెండింగ్‌లో ఉంటున్నాయని అంటున్నారు.

రెండు నెలలుగా....

రాజోళిలో ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలకు రెండు నెలలుగా కూలిలు పెండింగ్‌లో ఉన్నాయని స్థానిక కూలీలు అంటున్నారు. డబ్బులు చెల్లించకపోతే జీవనం ఎలా గడుస్తుందని అధికారులకు మొర పెట్టుకున్నా స్పందించడం లేదన్నారు. ప్రస్తుతం పాఠశాలలు కూడా తెరవడంతో పిల్లలకు ఖర్చులు పెరిగాయని, సమయానికి డబ్బులు చెల్లించకపోతే కుటుంబం గడవటం కష్టంగా మారుతుందని అంటున్నారు. దీనికి తోడు పని కల్పనలో కూడా అధికారుల జాప్యం వల్ల సక్రమంగా పని రోజులు లభించడం లేదని అంటున్నారు. పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది మధ్య సమన్వయ లోపం కారణంగా, పంచాయతీ కార్యదర్శులు చెబుతున్న వారి పనుల కారణంగా కూలీలకు పని కల్పనలో ఆటంకాలు ఏర్పడుతున్నాయని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులను అడిగితే త్వరలోనే పనులు మొదలవుతున్నాయని చెబుతున్నారే కాని, పలు కారణాలను చూపి జాప్యం చేస్తున్నారని అంటున్నారు. వానాకాలం కావడంతో చాలా మంది కూలీలు వ్యవసాయ పనుల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్తారని, ఉపాధి హామీ పథకాన్ని నమ్ముకుని ప్రతి ఏడాది స్థానికంగా ఉండే వారికి కూడా పనులు కల్పించకపోతే వారి జీవనోపాధి కష్టమవుతుందని కూలీలు అంటున్నారు. ఉపాధి హామీ సిబ్బంది సరైన పని దినాలు కల్పించకపోతే ఇతర ప్రాంతాలకు ఆటోలు, ప్రైవేట్ వాహనాలల్లో వెళ్లి ప్రమాదాలకు గురవుతున్నారని, ఇలాంటి సమస్యలను దృష్టిలో పెట్టుకుని అధికారులు పని దినాలు సక్రమంగా కల్పించడంతో పాటు, పెండింగ్‌లో ఉన్న కూలీలు చెల్లించాలని కోరుతున్నారు.



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

కుటుంబ పోషణ భారం



ఇతర ప్రాంతాలకు వెళ్లి పనులు చేయలేము. స్థానికంగా ఉపాధి హామీ పనులకు వెళ్తాం. అధికారులు సమయానికి డబ్బులు ఇవ్వకపోతే కుటుంబ పోషణ ఎలా సాధ్యం. పని కల్పనలో కూడా అధికారుల తీరు వల్ల పూర్తి కావడం లేదు. రెండు నెలల బిల్లులు ఇవ్వలేదు. స్థానికంగా రోజూ మాకు పని కల్పించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– కర్రెమ్మ, రాజోళి

పనులు లేవు..



గతంలో ఉపాధి హామీ అధికారులు పని కల్పించే విషయంలో ముందుండేవారు. ప్రస్తుతం ఇతర అధికారులు కూడా ఉన్నప్పటికీ వారికి సమన్వయం ఉండటం లేదు. దీంతో పని కల్పనలో పలు సమస్యలు తలెత్తుతున్నాయి. బిల్లులు కూడా సమయానికి చెల్లించడం లేదు.

– లలితమ్మ, రాజోళి

ఉన్నతాధికారులకు తెలిపాం



రాజోళిలోని ఉపాధి హామీ కూలీలకు నాలుగు వారాల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. మా స్థాయిలో అన్ని పూర్తి చేసి పంపాం. ఉన్నతాధికారుల నుంచే బిల్లులు రావాల్సి ఉంది. అక్కడి నుంచి అందగానే కూలీలకు చెల్లింపులు చేస్తాం. విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్తాం.

– ప్రసాద్, ఉపాధి హామీ ఏపీఓ, రాజోళి

కార్యదర్శులు సహకరిస్తున్నారు

ఉపాధి హామీ పనులకు పంచాయతీ కార్యదర్శులు పూర్తిగా సహకరిస్తున్నారు. కూలీలకు, సిబ్బందికి నిత్యం అందుబాటులో ఉంటున్నారు. వారి సమన్వయం లోపం వల్ల పనులకు ఆటంకం కలిగితే వారిపై ఉన్నతాధికారులకు నివేదిక పంపుతాం. తప్పనిసరిగా చర్యలు ఉంటాయి.

– ఖాజా మొయినుద్దీన్, ఎంపీఓ, రాజోళి

వక్ఫ్ భూముల అన్యాక్రాంతంపై సర్వే

అమరచింత: మండలంలోని ఆయా గ్రామాల్లో గల వక్ఫ్ భూములు అన్యాక్రాంతం అవుతున్నాయనే ఆరోపణలపై రెవెన్యూ అధికారులు సర్వే చేపట్టారు. తహసీల్దార్ షేక్ చాంద్‌పాషా ఆధ్వర్యంలో ఆర్ఐ గోపాల్, సర్వేయర్ పాండు కలిసి పట్టణ శివారులోని వక్ఫ్ భూములను సర్వే నంబర్ల ఆధారంగా పంట పొలాల్లోకి వెళ్లి భూ రికార్డులను పరిశీలించారు. తహసీల్దార్ మాట్లాడుతూ మండలంలో మసీదులు, పీర్ల చావిడీలు, దర్గాల నిర్వహణ కోసం అమ్మాపురం సంస్థానదీశురాలు రాణి మహాలక్ష్మీదేవమ్మ 72 ఎకరాలు అప్పగించారని, వచ్చిన ఆదాయంతో వాటి నిర్వహణ చేసేవారన్నారు.

నివాళి అర్పించిన ఎమ్మెల్యే

అయిజ: పట్టణంలోని మాలపేటలో మున్సిపల్ వైస్ చైర్మన్ మాల నరసింహులు అన్న మునిస్వామి (50) అనారోగ్యంతో మృతి చెందాడు. అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు శనివారం వారి నివాసం చేరుకుని మృతదేహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.